**2023** • నాడు సాగునీటికి నెలవై..



**2024** • నేడు జీవం లేని కాలువై..



ఇది కల్వకుర్తి ఎత్తిపోతల పథకం ద్వారా పారే కాలువ. నిరుడు మార్చి నెలలో పుష్కలంగా నీళ్లతో కళకళలాడిన కాలువ ప్రస్తుతం ఇలా వట్టిపోయింది. పంటలకు నీళ్లిచ్చిన కాలువల్లో మూగజీవాలు కూడా కష్టంగా నీళ్లుతాగుతున్న ఈ దృశ్యం నాగర్‌కర్నూలు జిల్లా బిజినపల్లి మండలం అల్లీపూర్ గ్రామ శివారులో కనిపించింది.



మంత్రి జూపల్లి కృష్ణారావుకు రైతుల వినతి

## కేఎల్ఐ నుంచి నీరు విడుదల చేయండి

కల్వకుర్తి ఎత్తిపోతల ద్వారా వనపర్తి, నాగర్‌కర్నూల్ జిల్లాల్లోని రైతులకు తక్షణమే నీటిని విడుదల చేయాలని శనివారం రాష్ట్ర ఎక్సైజ్, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావును హైదరాబాద్‌లో ప్రత్యేకంగా కలిసి వినతి పత్రం అందజేస్తున్న రైతు, వ్యవసాయ కార్మిక సంఘాల నాయకులు వెంకట్, సాగర్, వెంకట్ రాములు, ఎండీ జబ్బార్ తదితరులు

*– హైదరాబాద్, మార్చి 9 (నమస్తే తెలంగాణ)*

# కాల్వల్లో నీళ్లిడువరు..

# ఎవుసానికి కరెంటియ్యరు

పదేండ్లలో చూడని కష్టాలు మళ్లీ మొదలు

- సాగునీరు లేక ఎండిపోతున్న వరి పంటలు
- గొర్రెలు, పశువులకు మేతలవుతున్న పొలాలు
- వడ్లు అమ్మాల్సిన రైతులకు గొడ్డుగడ్డి కోసే స్థితి

## కాంగ్రెస్ హయాంలో అన్నీ కరువే..

(నమస్తే తెలంగాణ, న్యూస్ నెట్‌వర్క్): 'కేసీఆర్ ప్రభుత్వంలో గుట్టలపై కూడా పంటలు పండించాం. గతంలో వలసబాట పట్టిన మేము పదేండ్లుగా పంటల బాట పట్టినం. ఏటా రెండు పంటలు పండించి రూ.5 లక్షల నుంచి రూ.8 లక్షల వరకు సంపాదించేవాళ్లం. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి కాల్వల నీళ్లు బంద్ అయ్యాయి. మేం వేసుకున్న పంటలన్నీ ఎండిపోతున్నాయి. పంట పెట్టుబడి అందకపోవడంతో అప్పులు చేశాం. వాటిని ఎవరు తీర్చాలి ? మాకు మళ్లీ బొంబాయి కష్టాలు మొదలవుతున్నాయి' అంటూ వనపర్తి మండలంలోని కీర్యాతండా, గుంత తండాలకు చెందిన గిరిజన రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇది ఈ రెండు తండా ప్రజలదే కాదు.. రాష్ట్రంలోని రైతులందరి పరిస్థితీ ఇలాగే ఉంది. కాంగ్రెస్ హయాంలో కాల్వల్లో నీళ్లు రాక, సమయానికి కరెంట్ రాక రైతులు అరిగోసపడుతున్నారు. పొలం తడి పెట్టేందుకు తండ్లాట పడుతున్నారు. కండ్ల ముందే ఎండిన పంటను చూడలేక ట్యాంకర్లతో నీళ్లు పెడుతూ తల్లడిల్లిపోతున్నారు. పొట్ట దశలోకి వచ్చిన పచ్చని పంటలను పశువుల మేతగా వదిలేస్తున్నారు. వడ్లు అమ్ముకోవాల్సిన రైతులు గొర్రెలకు, పశువులకు అడ్డికి పావుశేరుకు గడ్డి అమ్ముకుంటున్నారు.



వనపర్తి: కుంటోని తండాలో పొట్టదశలో నిలువునా ఎండిపోయి గొర్రెలకు మేతగా మారిన వరిపొలం

### మళ్లీ బొంబాయి కష్టాలు..



ఎప్పటిలాగే కాల్వ నీళ్లు వస్తాయని ఆశపడ్డ. ఎనిమిది ఎకరాల్లో వరి వేశాను. ఇప్పటికే నాలుగెకరాలు ఎండిపోయింది. మిగిలింది కూడా ఎండిపోవడమే తప్పా పండేది లేదు. లక్షల రూపాయల పంటలు పండించినోళ్లమే తినడానికే మళ్లీ కొనుక్కొనే పరిస్థితి వచ్చింది. కాంగ్రెస్ ప్రభుత్వంలో రైతుబంధు కూడా పడడం లేదు. మాకు మళ్లీ బొంబాయి కష్టాలు మొదలయ్యాయి.

– ఎల్.పాండు, కుంటోని తండా, వనపర్తి మండలం

### పరిహారం ఇవ్వాలి..



కాల్వ ద్వారా నీళ్లు విడుదల చేయకుండా ముందే నిలుపుదల చేయడంతో వేసుకున్న పంటలన్నీ ఎక్కడికక్కడ ఎండిపోతున్నాయి. ఎండిపోతున్న పంట చేలను చూస్తే.. ఎవరికైనా గుండె తరుక్కుపోతుంది. పదేండ్లుగా పంటలు పండించిన రైతులు ప్రస్తుతం కన్నీరుమున్నీరవుతున్నారు. పెట్టుబడిలేక అప్పుల పాలవుతున్న రైతులకు ప్రభుత్వం పరిహారం చెల్లించాలి.

–కె.మాణిక్యం, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు, వనపర్తి

### కరెంటోళ్లు కనికరించకపాయే

- ఇదీ గొల్లపల్లి రైతుల గోస

నెన్నెల, మార్చి 9 : '100 కేవీ ట్రాన్స్‌ఫార్మర్ నుంచి ఆయిల్ లీకవుతుందని, లో వోల్టేజీ సమస్య ఉందని నెలకిందే ఏఈకి చెప్పినం. బోర్లు కాలిపోతున్నయి... నీళ్లు లేక పంటలు ఎండిపోతున్నయి.. ఎంత మొరపెట్టుకున్నా కరెంటోళ్లు కనికరించకపాయే' అని మంచిర్యాల జిల్లా నెన్నెల మండలం గొల్లపల్లికి చెందిన రైతులు శనివారం నెర్రెలు బారిన పంట పొలాలను చూపిస్తూ ఆవేదన వ్యక్తం చేశారు. ఊరిలోని 100 కేవీ ట్రాన్స్‌ఫార్మర్ పరిధిలో 80 ఎకరాలకు పైగా వరి సాగయ్యిందని, అధికారుల నిర్లక్ష్యంతో పంట చేతి కందకుండా పోయే పరిస్థితి దాపురించిందని తమ గోడును వెల్లబోసుకున్నారు. ఈ విషయమై ఏఈ మల్లయ్యను వివరణ కోరగా, రైతులంతా ఒకేసారి మోటర్లు స్టార్ట్ చేయడం వల్ల డీటీఆర్ మీద ఓవర్‌లోడ్ పడుతుందని, దాంతో ఫీజులు ఆగడంలేదని, రైతులు సమన్వయంతో కరెంటును వినియోగించుకోవాలని అన్నారు.



కరెంట్ లేక ఎండిపోయిన వరి పొలంలో మంచిర్యాల జిల్లా నెన్నెల మండలం గొల్లపల్లి రైతులు



### ట్యాంకర్ అద్దెకు తీసుకున్న..

నాలుగు ఎకరాల్లో వరి సాగు చేసిన. సుమారు రూ. 60 వేల వరకు పెట్టుబడి అయ్యింది. పొలమంతా పొట్ట, ఈత దశలో ఉంది. సాగునీళ్లు లేక ఇబ్బంది అవుతుండడంతో ఓ రైతు వద్ద రూ. 10 వేలకు బోర్ నీళ్లు మాట్లాడుకొని ట్యాంకర్‌ను అద్దె తీసుకొని వరి చేనుకు పోస్తున్న. ఇలా రెండెకరాలు పారుతుంది. మిగిలిన రెండెకరాలు పూర్తిగా ఎండిపోయింది. ఏడేనిమిదేళ్లుగా నీళ్ల కరువు లేకుండా ఉండేది. ఇప్పుడే ఇబ్బంది అవుతుంది. నష్టపోయిన రైతులకు సీఎం రేవంత్‌రెడ్డి ఏం చేస్తారో చూడాలె మరి.

–గొట్టె మహేందర్, అక్కన్నపేట, సిద్దిపేట జిల్లా

### పంటనష్ట పరిహారమివ్వాలి

- రైతు రక్షణ సమితి డిమాండ్

హైదరాబాద్, మార్చి 9 (నమస్తే తెలంగాణ): చీడపీడలు, కరువుతో యాసంగిలో తీవ్రంగా దెబ్బ తింటున్న వరిపంట ఆందోళన కలిగిస్తున్నదని తెలంగాణ రైతు రక్షణ సమితి అధ్యక్షుడు పాకాల శ్రీహరిరావు తెలిపారు. ఈ పంట నష్టానికి పరిహారమివ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ విషయమై ఆయన శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఇప్పటికే భారీ విస్తీర్ణంలో పంట నష్టం వాటిల్లిందని, ఇంకా పెరిగే అవకాశం ఉన్నదని పేర్కొన్నారు. ఈ సీజన్ నుంచే పంటల బీమాను అమలు చేయాలని కోరారు. లేనిపక్షంలో రైతులు ఆర్థికంగా పెద్ద ఎత్తున నష్టపోయే ప్రమాదం ఉన్నదని తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం రైతుబంధు విడుదల చేయాలని కోరారు. లేనిపక్షంలో పార్లమెంట్ ఎన్నికల్లో రైతుల నుంచి వ్యతిరేకత తప్పదని శ్రీహరిరావు హెచ్చరించారు.

## ఎస్సారెస్పీ కెనాల్‌లో నీళ్లు రావు

- బోరుబావులపైనే ఆధారపడండి
- పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి



కోనాయిమాకుల ప్రాజెక్టు మ్యాప్‌ను పరిశీలిస్తున్న పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి

గీసుగొండ, మార్చి 9: శ్రీరాంసాగర్ ప్రాజెక్టులో నీళ్లు తక్కువగా ఉన్నాయి.. కెనాల్ ద్వారా సాగు నీళ్లు ఇచ్చే పరిస్థితులు లేవని, రైతులు బోర్లు బావులపైనే ఆధారపడి వ్యవసాయం చేసుకోవాలని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి అన్నారు. వరంగల్ జిల్లా గీసుగొండ మండలం కోనాయిమాకుల లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టును శనివారం ఆయన పరిశీలించారు. రూ.139 కోట్లతో నిర్మిస్తున్న ఈ ప్రాజెక్టు ద్వారా గీసుగొండ, సంగెం, దుగ్గొండి మండలాల్లో 14వేల ఎకరాలకు సాగునీరు అందుతాయని అధికారులు వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రకాశ్‌రెడ్డి మాట్లాడుతూ కాంట్రాక్టర్‌తో మాట్లాడి పనులు ప్రారంభించాలని సూచించారు. రైతులు వ్యవసాయ కరెంట్‌ను పొదుపుగా వాడుకోవాలని సూచించారు. కెనాల్ వెంట ఉన్న మొరాన్ని అక్రమంగా తరలించే వారిపై కేసులు పెట్టాలని అధికారులను ఆదేశించారు.



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎంపీ రవీంద్ర నాయక్


### బీజేపీతో బంజారాలకు ఒరిగిందేమీలేదు

- అందుకే పార్టీకి రాజీనామా చేస్తున్నా
- మాజీ ఎంపీ రవీంద్రనాయక్

ఖైరతాబాద్, మార్చి 9 : కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ హయాంలో బంజారాలకు న్యాయం జరుగలేదని అందుకే పార్టీకి రాజీనామా చేస్తున్నానని మాజీ ఎంపీ ధరావత్ రవీంద్ర నాయక్ అన్నారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ 1969 తొలి తెలంగాణ ఉద్యమంతో పాటు 1973లో విద్యార్థి నేతగా బంజారా, లంబాడీ సమస్యల పరిష్కారానికి గళమెత్తానని గుర్తుచేశారు. బీజేపీ ప్రభుత్వం లంబాడ గిరిజనులకు న్యాయం చేస్తుందని నమ్మి 2019లో ఆ పార్టీలో చేరానని చెప్పారు. నాలుగేండ్ల కాలంలో బంజారా, లంబాడీ సమస్యలను కేంద్రం ముందు ఉంచితే ఏ ఒక్కదానినీ పట్టించుకోలేదని మండిపడ్డారు. బీజేపీతో ఒరిగేదేముండదని అర్థమై రాజీనామా చేస్తున్నానని తెలిపారు. ఏ పార్టీలో చేరుతానన్నది త్వరలోనే ప్రకటిస్తానని పేర్కొన్నారు.

### సీపీఐకి ఒక స్థానం కేటాయించండి

- కాంగ్రెస్ పార్టీకి సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని విజ్ఞప్తి



హైదరాబాద్, మార్చి 9 (నమస్తే తెలంగాణ): బీజేపీని నిలువరించడానికి మిత్రధర్మంలో భాగంగా కాంగ్రెస్ పార్టీ తెలంగాణలో ఒక లోక్‌సభ స్థానాన్ని తమ పార్టీకి కేటాయించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు విజ్ఞప్తి చేశారు. శనివారం హైదరాబాద్‌లోని ముగ్ధూంభవన్‌లో సీపీఐ జాతీయ కార్యవర్గం సభ్యులు చాడ వెంకటరెడ్డి, పల్లా వెంకట్‌రెడ్డి, పీ పద్మ, ఎన్ బాలమల్లేశ్‌తో కలిసి ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. తాము పోటీ చేయడానికి వీలుగా ఉండే ఐదు స్థానాల పేర్లను ప్రకటించి, అందులో ఒకటి ఇవ్వాలని ఇప్పటికే కోరినట్టు కూనంనేని తెలిపారు.

# ఈసారి మోదీని బండకేసి కొడ్తరు

- కేంద్రంలో కొలువుదీరేది కాంగ్రెస్ ప్రభుత్వమే
- బలం ఉంటే పొత్తుల కోసం ఎందుకు వెంపర్లాట?
- నాడు కేసులు పెట్టారు.. నేడు వారినే అడుక్కొంటున్నారు
- కాంగ్రెస్ గెలిస్తేనే మేడ్చల్‌లో అభివృద్ధి జరుగుతుంది
- మేడ్చల్ బహిరంగసభలో సీఎం రేవంత్‌రెడ్డి

హైదరాబాద్, మార్చి 9 (నమస్తే తెలంగాణ): ప్రధాని నరేంద్రమోదీని బండకేసి కొట్టడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని, కేంద్రంలో రాబోయేది కాంగ్రెస్ ప్రభుత్వమేనని సీఎం రేవంత్‌రెడ్డి ధీమా వ్యక్తంచేశారు. మేడ్చల్‌లో శనివారం నిర్వహించిన బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ.. వచ్చే ఎన్నికల్లో 400 సీట్లు వస్తాయంటూ గొప్పలు చెప్పుకొంటున్న మోదీ.. ఆయా రాష్ట్రాల్లో పొత్తులు ఎందుకు పెట్టుకుంటున్నారని ప్రశ్నించారు. అప్పుడు అక్రమ కేసులు పెట్టి.. ఇప్పుడు వారినే పొత్తుల కోసం ఎందుకు అడుక్కుంటున్నారని నిలదీశారు. ఇన్ని పొత్తులు పెట్టుకుంటున్న ఎన్డీయే అతుకుల బొంత కాదా అని ప్రశ్నించారు. కాంగ్రెస్ అధికారంలోకి రాదంటున్నారని, 2004కు ముందు కూడా ఇలాగే అన్నారని, కానీ ఆ తరువాత రెండుసార్లు అధికారంలోకి వచ్చిందని గుర్తుచేశారు. ఇప్పుడు కూడా అదే జరుగుతుందని చెప్పారు. బీజేపీకి ఓటెందుకు వేయాలని అడిగారు. రైతుల ఆదాయం రెట్టింపు చేస్తానని, ఇండ్లు కట్టిస్తానని, రూ.15 లక్షలు అకౌంట్లో వేస్తానని మోదీ ఎన్నో హామీలు ఇచ్చారని, ఏ ఒక్కటీ నెరవేర్చలేదని విమర్శించారు. మల్కాజ్‌గిరి మేడ్చల్‌లో కాంగ్రెస్‌కు ఎమ్మెల్యేలు లేరని, ఇప్పుడు ఎంపీ కూడా లేకుంటే అభివృద్ధి జరగదని చెప్పారు. అందుకే మల్కాజిగిరి లోక్‌సభ స్థానంలో కాంగ్రెస్‌కు ఓటేసి గెలిపించాలని కోరారు. మేడ్చల్ అభివృద్ధి చెందాలన్నా... ఐటీ కంపెనీలు రావాలన్నా కాంగ్రెస్ గెలవాల్సిందే అని అన్నారు.

**ఈటల ఓటెట్ల అడుగుతడు...**

మేడ్చల్ పక్కన ఫాంహౌజ్ కట్టుకుని ఉంటున్న ఈటల రాజేందర్ ఏనాడైనా మల్కాజిగిరి నియోజకవర్గ ప్రజల బాగోగులు చూశాడా అని రేవంత్‌రెడ్డి ప్రశ్నించారు. ఏనాడూ మేడ్చల్, మల్కాజిగిరి ప్రజల బాగోగులు చూడని ఈటల ఇప్పుడు సిగ్గు లేకుండా ఓట్లు ఎలా అడుగుతారని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కూలగొట్టే మొగోడు ఉన్నడా అని ప్రశ్నించారు. సంతలో పశువులను కొన్నట్టు ఎమ్మెల్యేలను కొనాలని చూస్తున్నారని, ఆ పప్పులు ఏమీ ఉడకవని అన్నారు. ఎవరైనా అటువంటి ప్రయత్నం చేస్తే వారిని ప్రజలు సామాజిక బహిష్కరణ చేస్తారని చెప్పారు. ఇక 90 రోజుల్లో 30 వేల ఉద్యోగాలు ఇచ్చి నిరుద్యోగులకు కాంగ్రెస్ అండగా నిలబడిందని అన్నారు. ఉద్యోగాల్లో మహిళలకు అన్యాయం చేశారంటూ ఎమ్మెల్సీ కవిత ఆరోపిస్తున్నారని, కానీ 43 శాతం కొలువులు అమ్మాయిలకే ఇచ్చినట్టు తెలిపారు. కాంగ్రెస్ పార్టీపై నెపం నెట్టడానికే మేడిగడ్డను తొందరగా రిపేర్ చేయాలని మాజీ సీఎం కేసీఆర్ డిమాండ్ చేస్తున్నారని అన్నారు. ఢిల్లీ నుంచి అధికారులు వచ్చారని, వాళ్లు పరిశీలించి రిపేర్ చేయాలని చెప్తే చేస్తామని తెలిపారు. లేదా ప్రాజెక్టును మొత్తం మళ్లీ కట్టాల్సి వస్తుందా అనేది అధికారులు సూచిస్తారని చెప్పారు.



## అధునాతన నైపుణ్య శిక్షణకు ఒప్పందం

- 65 ఐటీఐ కాలేజీల్లో కేంద్రాలు
- వచ్చే విద్యాసంవత్సరం నుంచే ప్రాజెక్టు ప్రారంభం
- టాటా గ్రూప్‌తో నిర్ణయానికి రాష్ట్ర ప్రభుత్వ అంగీకారం

హైదరాబాద్, మార్చి 9 (నమస్తే తెలంగాణ): టాటా గ్రూప్ ఆధ్వర్యంలో రాష్ట్రంలోని 65 ఐటీఐ కాలేజీల్లో అధునాతన సాంకేతిక నైపుణ్య శిక్షణ కేంద్రాలు (స్కిల్లింగ్ సెంటర్లు) ఏర్పాటు కానున్నాయి. ఈ మేరకు టాటా గ్రూప్ ప్రతినిధులు శనివారం సచివాలయంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమక్షంలో రాష్ట్ర ప్రభుత్వంతో ఒప్పందం చేసుకున్నారు. ఒప్పందంలో భాగంగా టాటా గ్రూప్ ప్రభుత్వ భాగస్వామ్యంతో రాష్ట్రంలోని ఐటీఐలను అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లుగా అప్‌గ్రేడ్ చేయనున్నది. 9 లాంగ్ టర్మ్, 23 షార్ట్ టర్మ్ కోర్సులతోపాటు పలు బ్రిడ్జి కోర్సులను నిర్వహించనున్నారు. 2024–25 విద్యా సంవత్సరం నుంచే ఈ ప్రాజెక్టును అమలు చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం రూ.2700 కోట్ల ఖర్చుతో ఐటీఐల్లో ఈ ప్రాజెక్టును అమలు చేయనున్నది. అవసరమైన వర్క్‌షాప్‌ల నిర్మాణం, యంత్రాలు, పరికరాలతోపాటు శిక్షణ అందించే ట్యూటర్ల నియామకాన్ని టాటా టెక్నాలజీస్ చేపడుతుంది. ఏటా 9000 మందికి అడ్మిషన్లు కల్పిస్తారు. దాదాపు లక్ష మందికి షార్ట్ టర్మ్ కోర్సుల్లో శిక్షణ ఇస్తారు. వివిధ రంగాల్లో పారిశ్రామిక అవసరాలకు, ప్రస్తుత కోర్సులకు మధ్య ఉన్న భారీ అంతరాన్ని తగ్గించే లక్ష్యంతో ఈ ప్రాజెక్టును చేపట్టినట్టు సీఎం ఈ సందర్భంగా చెప్పారు. అక్టోబర్ నుంచి మొదలయ్యే అకడమిక్ సెషన్‌కు వర్క్ ఆప్షన్లను అందుబాటులో ఉంచాలని, ట్యూటర్లను నియమించాలని టాటా టెక్నాలజీ ప్రతినిధులకు సీఎం సూచించారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, ఐటీశాఖ మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ.. హైదరాబాద్‌ను స్కిల్ డెవలప్‌మెంట్ హబ్‌గా తీర్చిదిద్దుతామని చెప్పారు. రాష్ట్రంలో స్కిల్ యూనివర్సిటీని నెలకొల్పనున్నామని తెలిపారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, ఉపాధి శిక్షణశాఖ స్పెషల్ సీఎస్ రాణి కుముదిని, టాటా టెక్నాలజీస్ ప్రెసిడెంట్ పవన్ బగేరియా పాల్గొన్నారు.

## నేడు ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలతో సీఎం సమావేశం

హైదరాబాద్, మార్చి 9 (నమస్తే తెలంగాణ): పార్లమెంట్ ఎన్నికలు సమీపిస్తున్న వేళ ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలను మచ్చిక చేసుకోవడంలో భాగంగా శనివారం సీఎం రేవంత్‌రెడ్డి ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలతో భేటీ కానున్నారు. సాయంత్రం నాలుగు గంటలకు, జూబ్లీహిల్స్‌లోని మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థ (ఎంసీఆర్‌హెచ్‌ఆర్‌డీ)లో అన్ని రకాల సంఘాల నేతలతో సమావేశం కానున్నారు. ఈ మేరకు సీఎంవో వర్గాలు పలు సంఘాలకు సమాచారాన్ని అందించాయి. సీఎంగా రేవంత్‌రెడ్డి బాధ్యతలు స్వీకరించిన తర్వాత కొన్ని సంఘాల నేతలు కలిశారు. మరికొన్ని సంఘాలు నేతలకు ఇప్పటివరకు సీఎంను కలిసే అవకాశం దక్కలేదు. ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల ద్వారా ప్రభుత్వ పెద్దల ద్వారానే కలిసే అవకాశం దక్కగా, కొన్ని సంఘాలకు సీఎంను కలిసే అవకాశం దక్కకపోగా ఇది వారికి మింగుడుపడటం లేదు. స్థూలంగా ఇది వ్యతిరేకతకు దారి తీస్తుందని భావించిన సీఎం ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలతో ఆదివారం సమావేశం కావాలని నిర్ణయించారు. దాదాపు 70కి పైగా సంఘాలను ఈ సమావేశానికి ఆహ్వానించినట్టు తెలిసింది. ఈ సమావేశంలో పలు అంశాలను సీఎం దృష్టికి తీసుకెళ్లాలని సంఘాల నేతలు భావిస్తున్నారు. పీఆర్సీ కమిటీకి ఇటీవలే అన్ని సంఘాలు ప్రతిపాదనలు సమర్పించాయి. పీఆర్టీయూ 50, టీఎస్‌టీఎన్జీవోలు 51 శాతం, టీజీవోలు 40 శాతం ఫిట్‌మెంట్‌ను కోరారు. ఫిట్‌మెంట్ సహా పెండింగ్‌లో ఉన్న నాలుగు డీఏలను విడుదల చేయడం, సీపీఎస్ రద్దు, బదిలీలు, పదోన్నతులు చేపట్టాలని, జీవో–317తో నష్టపోయిన వారికి న్యాయం చేయడం, పెండింగ్ బిల్లులను జారీ చేయాలని, ఈహెచ్ఎస్ అమలు వంటి అంశాలను ప్రస్తావించాలని ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘాలు భావిస్తున్నాయి.

## 12న రాష్ట్ర క్యాబినెట్ సమావేశం

హైదరాబాద్, మార్చి 9 (నమస్తే తెలంగాణ): తెలంగాణ రాష్ట్ర క్యాబినెట్ సమావేశం ఈ నెల 12న నిర్వహించనున్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధ్యక్షతన మంగళవారం మధ్యాహ్నం 12 గంటలకు సచివాలయంలోని ఆరో అంతస్తులో సమావేశం కొనసాగనున్నది. ఎన్నికల కోడ్ ఈ వారంలో రానున్నదన్న వార్తల నేపథ్యంలో పలు అంశాలకు క్యాబినెట్ ఆమోదం తెలిపే అవకాశం ఉన్నదని రాజకీయ విశ్లేషకులు, మేధావులు అంచనా వేస్తున్నారు.

## రాష్ట్రం నుంచి పోటీకి కాంగ్రెస్ పెద్దల విముఖత

- పీసీసీ నేతల అభ్యర్థనలు బేఖాతరు

హైదరాబాద్, మార్చి 9 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ అగ్రనేతలు సోనియా, రాహుల్, ప్రియాంక గాంధీ రాష్ట్రం నుంచి లోక్‌సభ ఎన్నికల బరిలో నిలిచేందుకు విముఖత వ్యక్తం చేశారు. రాష్ట్రం నుంచి పోటీ చేయాలని పలుమార్లు రాష్ట్ర నేతలు విజ్ఞప్తి చేసినా వారు పెద్దగా పట్టించుకోలేదు. ఇప్పటికే ప్రత్యక్ష ఎన్నికల నుంచి తప్పుకొన్న సోనియాగాంధీ రాజస్థాన్ నుంచి రాజ్యసభకు ఎన్నికయ్యారు. ఇక రాహుల్‌గాంధీ కేరళలోని వయనాడ్ నుంచి మరోసారి బరిలోకి దిగుతారని కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన తొలి జాబితా ద్వారా వెల్లడైంది. ప్రియాంక గాంధీ ఇదివరకు తన తల్లి ప్రాతినిధ్యం వహించిన రాయ్‌బరేలీ నుంచి పోటీకి సిద్ధమవుతున్నట్టు తెలిసింది. దీంతో గాంధీ కుటుంబానికి చెందిన నేతలెవరూ తెలంగాణ నుంచి పోటీ చేసే అవకాశాలులేనట్టు తెలుస్తున్నది.

**విన్నపాల వెనుక 'రాజకీయం'...**

అధిష్ఠానం నేతలను రాష్ట్రం నుంచి మరీ ముఖ్యంగా ఖమ్మం, నల్లగొండ, భువనగిరి, మెదక్ స్థానాల నుంచి పోటీ చేయించాలని ప్రయత్నించడం వెనుక పెద్ద రాజకీయమే ఉన్నదని అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఈ సీట్లలో రాష్ట్రస్థాయి నేతల నుంచి తీవ్ర పోటీ నెలకొంది. ఎవరికి సీటు దక్కినా ఇతరులు వారికి సహకరించే పరిస్థితి లేదు. దీంతో మధ్యేమార్గంగా అధిష్ఠానం నేతలు బరిలో నిలిస్తే తమకు ఈ తలనొప్పులు ఉండవని భావించినట్టు తెలిసింది. అయితే అధిష్ఠానం నేతలు మాత్రం విముఖత వ్యక్తం చేయడం ఇప్పుడు చర్చనీయాంశమైంది. ఇప్పటికే రాష్ట్ర నేతల్లో అంతర్గత కుమ్ములాటలున్నాయి. ఈ కుమ్ములాటల మధ్య పోటీ చేస్తే ఓడిపోయినా పెద్దగా ఆశ్చర్యపోనవసరం లేదన్న ఉద్దేశంతోనే అధిష్ఠానం నేతలు విముఖత వ్యక్తం చేసినట్టు సమాచారం.

## బీజేపీ, టీడీపీ, జనసేన పొత్తు

- మూడు పార్టీల సంయుక్త ప్రకటన
- సీట్ల సర్దుబాటుపై ఏకాభిప్రాయం

హైదరాబాద్, మార్చి 9 (నమస్తే తెలంగాణ): ఆంధ్రప్రదేశ్‌లో లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికల్లో కలిసి పోటీ చేయాలని బీజేపీ, టీడీపీ, జనసేన పార్టీలు నిర్ణయించాయి. ఈ మేరకు ఈ మూడు పార్టీలు శనివారం సంయుక్తంగా ప్రకటన విడుదల చేశాయి. పొత్తులో భాగంగా బీజేపీ, జనసేనలకు 30 అసెంబ్లీ, 8 పార్లమెంట్ స్థానాలను ఇస్తున్నట్టు చంద్రబాబు తమ పార్టీ ముఖ్య నేతలకు వివరించినట్టు తెలిసింది. ఎన్డీయే కూటమిలో తెలుగుదేశం పార్టీ చేరడం ఇదే మొదటిసారి కాదు. 1996లో టీడీపీ మొదటిసారి ఎన్డీయే కూటమిలో చేరింది. తిరిగి 2014లో లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికల్లో టీడీపీ, బీజేపీ కలిసి పోటీ చేశాయి. ఈ కూటమికి జనసేన బయటి నుంచి మద్దతు ప్రకటించింది. ఈసారి మూడు పార్టీలు కలిసి 2024లో పోటీ చేస్తున్నాయి. సీట్ల పంపకానికి సంబంధించిన విధి విధానాలను ఒకటి రెండు రోజుల్లో ఖరారు చేస్తారని సమాచారం.

**17న బహిరంగ సభ.. మోదీ హాజరు?**

ఈ నెల 17న ఆంధ్రప్రదేశ్‌కు ప్రధాని నరేంద్ర మోదీ రానున్నట్టు తెలిసింది. టీడీపీ, జనసేన, బీజేపీ సంయుక్తంగా నిర్వహించనున్న బహిరంగ సభలో ఆయన ప్రసంగిస్తారని టీడీపీ అధినేత చంద్రబాబు తమ పార్టీ ముఖ్యనేతల టెలికాన్ఫరెన్స్‌లో వివరించారు. సభ నిర్వహణకు ఏర్పాట్లు చేయాలని వారిని ఆదేశించారు. ఈ సభ 17న లేదా 18న ఉండవచ్చని భావిస్తున్నారు. ఢిల్లీలో కేంద్ర హోం మంత్రి అమిత్‌షాతో చర్చల అనంతరం చంద్రబాబు, పవన్ మీడియాతో మాట్లాడకుండానే వెళ్లిపోయారు.

## కుట్టుమిషన్లు తిరిగిచ్చేయండి

- బస్తీల్లో తిరుగుతూ నోటీసులు ఇస్తున్న పోలీసులు
- లబ్ధిదారులైన మైనార్టీ మహిళల ఆగ్రహం

బంజారాహిల్స్, మార్చి 9: పేద మైనార్టీ మహిళలకు పంపిణీ చేసిన కుట్టుమిషన్లను వెనక్కి ఇవ్వాలంటూ పోలీసులు నోటీసులు జారీ చేయడం హైదరాబాద్‌లోని ఖైరతాబాద్ నియోజకవర్గంలో కలకలం సృష్టిస్తున్నది. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నిరుడు అక్టోబర్‌లో పేద మైనార్టీ మహిళలకు తెలంగాణ స్టేట్ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ ఖైరతాబాద్ నియోజకవర్గంలోని 300 మంది లబ్ధిదారులను ఎంపిక చేసింది. తొలివిడతగా 100 కుట్టుమిషన్లను అందించారు. అక్టోబర్ 11న ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన తర్వాత ఓ వాహనంలో తరలిస్తుండగా 52 కుట్టుమిషన్లను పంజాగుట్ట పోలీసులు స్వాధీనం చేసుకోవడంతోపాటు కోడ్ ఉల్లంఘనపై సుమోటోగా కేసు నమోదు చేశారు. అంతకుముందే 48 కుట్టుమిషన్లను బంజారాహిల్స్ రోడ్ నెం.5లోని వెంకటేశ్వరకాలనీ డివిజన్ దేవరకొండ బస్తీకి చెందిన మైనార్టీ నేతల వద్దకు చేరాయి. వాటిని ఎన్నికలు ముగిసిన తర్వాత లబ్ధిదారులకు పంపిణీ చేశారు.

**కాంగ్రెస్ నాయకుల ఫిర్యాదుతో..**

కొందరు కాంగ్రెస్ నాయకులు ఇటీవల ప్రభుత్వానికి ఫిర్యాదులు చేయడంతో పేదలకు పంపిణీ చేసిన కుట్టుమిషన్లను వెనక్కి తీసుకోవాలని మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ అధికారులు నిర్ణయించారు. దీంతో దేవరకొండ బస్తీలో పంజాగుట్ట పోలీసులు సుమారు 30 మంది లబ్ధిదారులకు నోటీసులు ఇచ్చి సాయంత్రంలోగా కుట్టుమిషన్లను అప్పగించాలని ఆదేశించారు. కుట్టుమిషన్లను వెనక్కి ఇవ్వాలనడమేమిటని లబ్ధిదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికల వేళ నమోదైన కేసు విచారణలో భాగంగా వాటిని రికవరీ చేస్తున్నామని పంజాగుట్ట ఇన్‌స్పెక్టర్ బండారి శోభన్ తెలిపారు.